ప్రజాశక్తి

ఆదివారం 13 ఆగస్టు 2023 | 5 | శ్రీ సత్యసాయి



పారిశుధ్య కార్మికుడికి రూ.10 లక్షల పరిహారమివ్వాలి

సోమందేపల్లి : మేజర్ పంచాయతీలో పనిచేసే పారిశుధ్య కార్మికుడు మూర్తి శనివారం విధులు నిర్వహిస్తూ ప్రమాదానికి గురవడంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అధికారులు, పాలకవర్గం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందన్నారు. సెలవు రోజూ కార్మికులతో పనిచేయించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ ప్రమాదానికి అధికారులు, పాలకవర్గం బాధ్యత వహించాలన్నారు. అలాగే కార్మికుడికి మెరుగైన వైద్యం, రూ. 10 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుడికి సిఐటియు అండగా ఉంటుందని, కార్మికుడికి న్యాయం చేయాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపి ట్రాన్స్‌పోర్టు రంగం జిల్లా ప్రధాన కార్యదర్శి పెడబల్లి బాబా, సిఐటియు మండల నాయకులు రాజగోపాల్, చాంద్‌బాషా, గంగరాజు, కొండా వెంకటేష్, రంగప్ప, కెవిపిఎస్ నాయకులు వెంకటేష్, పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో..

అలసత్వంపై కలెక్టర్ సీరియస్..!

◆ ఇద్దరు బిఎల్‌ఒలపై సస్పెన్షన్ వేటు ◆ మనస్తాపంతో ఒకరు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఇంటిఇంటి ఓటరు సర్వే విషయంలో అలసత్వం వహించిన ఇద్దరు బూత్‌లెవల్ అధికారులపై అనంతపురం జిల్లా కలెక్టర్ గౌతమి కొరడా ఝళిపించారు. ఇద్దరు బూత్ లెవల్ అధికారులను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఇందులో పశు సంవర్ధకశాఖలో అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనాథ్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడం చర్చనీయాంశమైంది. ఇదిలాగుండగా ఓటరు జాబితా సవరణను చేపట్టేందుకు జులై 21వ తేది నుంచి ఆగస్టు 21వ తేది వరకు నెల రోజుల వ్యవధిలో ఇంటింటికెళ్లి ఓటరు జాబితాపై సర్వే చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర మంతటా ప్రారంభమైంది. ఈ కార్యక్రమం అనంతపురం జిల్లాలోనూ ప్రారంభమైనప్పటికీ చాలా నెమ్మదిగా సర్వే సాగుతోంది. ఈ నేపథ్యంలో ఓటరు సర్వేపై ఈనెల ఎనిమిదవ తేదీన జిల్లా కలెక్టర్ గౌతమి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఇంకా కొంత మంది అధికారులు ఓటరు సర్వేపై కదలికలేదని గుర్తించారు. ఎక్కడెక్కడ ఇంతవరకు కదల్లేదో వివరాలు అందజేయాలని ఆయా మండలాల తహశీల్దార్లకు ఆదేశించారు. వారిచ్చిన నివేదిక ప్రకారం చూస్తే వజ్రకరూరు మండలంలోని పోలింగ్ స్టేషన్ 63 కమలపాడులో ఇంత వరకు ఇంటింటి సర్వే మొదలు కాలేదు. అదే మండలంలోని పోలింగ్ స్టేషన్ 80 గడేహోతూరులోనూ సర్వే మొదలు కాలేదు. దీంతో సర్వే చేపట్టని కమలపాడు బూత్ లెవల్ అధికారి శ్రీనాథ్, జక్కల వెంకటేశ్‌పై చర్యలకు కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యంగానున్న ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ శుక్రవారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు.

తొమ్మిది రోజుల్లో 54శాతం పూర్తయ్యేనా..!

జులై 21 నుంచి ఆగస్టు 21 వరకు నెల రోజుల వ్యవధిలో ఇంటింటి సర్వే పూర్తి చేయాలని ఎన్నికల సంఘం సూచించింది. అయితే అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు 46 శాతమే పూర్తయ్యాయి. 19.39 లక్షల మంది ఓటర్లు ఉంటే 8.92 లక్షల మంది ఓటర్ల పరిశీలన పూర్తయింది. అంట 46 శాతం పరిశీలన పూర్తయ్యింది. ఇంకా 56 శాతం జరగాల్సి ఉంది. ఇప్పటికి 22 రోజులు పూర్తయ్యాయి. ఇక మిగిలింది కేవలం తొమ్మిది రోజుల గడువు మాత్రమే ఉంది. ఈ తక్కువ సమయంలో ఇంటింటి సర్వే పూర్తవడం సాధ్యమా అన్నది ప్రశ్నార్థకంగా ఉంది. ఒకవైపు సిబ్బంది అలసత్వమవుతే.. మరోవైపు సాంకేతిక సమస్యలూ ఉన్నాయి. సర్వయర్ సమస్యల వల్ల అనుకున్నంత వేగంగా సర్వే ముందుకు సాగడం లేదన్న అభిప్రాయం సిబ్బంది నుంచి వ్యక్తమవుతోంది. మరోవైపు ఎన్నికల సంవత్సరం కావడంతో రాజకీయ పార్టీలు ఓటర్ల జాబితాపై దృష్టి సారించాయి. తప్పిదాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు, ప్రత్యారోపణలు సాగుతున్నాయి.

బూత్‌లెవల్ అధికారి శ్రీనాథ్ ఆత్మహత్యాయత్నం

ఓటర్ల సర్వే పనిలో అలసత్వం వహించినందుకు కలెక్టర్ అతడిపై సస్పెన్షన్ వేటు వేయడం జరిగింది. దీనికి మనస్తాపం చెందిన శ్రీనాథ్ శనివారం నాడు ఆయన నివాసముంటున్న వజ్రకరూరు మండలంలోని గూళ్యపాల్యంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేసుకున్నాడు. ఇది గుర్తించిన తోటి వారు శ్రీనాథ్‌ను చికిత్స నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం నగరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. శ్రీనాథ్‌ది చెన్నేకొత్తపల్లి స్వగ్రామం. విదుల్లో భాగంగా వజ్రకకరూరు మండలంలోని గూళ్యపాలెంలో ఉంటున్నారు. మూడు రైతు భరోసా కేంద్రాలకు ఇన్‌ఛార్జీగానున్న శ్రీనాథ్ పని ఒత్తిడితో ఓటరు జాబితా సర్వేలో పాల్గొనలేదని సమీప బంధువులు చెబుతున్నారు. ఈ విషయం చెబుతున్నా అధికారులు తనపై చర్యలు తీసుకున్నారన్న మనస్థాపనంతోనే ఆత్మహత్యా యత్నం చేసినట్టు ఆయన తరుపు బంధువులు ఆరోపిస్తున్నారు.



ఆత్మహత్యకు యత్నించిన పశు సంవర్ధకశాఖ ఉద్యోగి శ్రీనాథ్

వెంకటరమణపల్లి ఘటన అత్యంత దుర్మార్గం

◆ మణిపూర్‌ను తలపించేలా దాడులు

◆ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

◆ వెంకటరమణపల్లి గ్రామంలో సిపిఎం బృందం పర్యటన



దాడికి సంబంధించి వెంకటరమణపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న శ్రీ సత్యసాయి జిల్లా సిపిఎం బృందం



గాయపడిన మహిళతో మాట్లాడుతున్న ఇంతియాజ్

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం వెంకటరమణపల్లి గ్రామంలో శుక్రవారం నాడు వడ్డెర కులస్తులపై వైసిపి మద్దతుదారులు దాడులు చేయడం అత్యంత దుర్మార్గమైనదని, తక్షణం దీనిపై పోలీసులు స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ డిమాండ్ చేశారు. వడ్డెర కుటుంబ సభ్యులపై భౌతిక దాడులతో దద్దరిల్లిన శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం వెంకటరమణపల్లి గ్రామాన్ని సిపిఎం జిల్లా నాయకత్వం శనివారం ఉదయం సందర్శించింది. శుక్రవారం నాడు దాడి జరిగిన విషయమై వాస్తవాలు తెలుసుకోవడానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇఎస్.వెంకటేష్, పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరప్పలతో కలిసి నాయకత్వ బందం గ్రామానికి వెళ్లింది. బాధిత కుటుంబ సభ్యులతో పాటు, గ్రామస్తులతో మాట్లాడారు. ముందస్తు ప్రణాళికతో అధికార పార్టీ అండదండలతో భూస్వామ్య వర్గాలు వెంకటరణపల్లిలో వడ్డెర కుటుంబ సభ్యులపై దాడి జరిగినట్లు గుర్తించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ మాట్లాడుతూ వెంకటరమణపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన జరిగిన ఘటన అత్యంత దారుణమైనద న్నారు. అధికార పార్టీ వైసిపి అండదండల తోనే పెత్తందారులు దాడులకు తెగబడ్డారన్నారు. మరో మణిపూర్ ఘటనను గుర్తు చేసేదిలా ఉందన్నారు. కర్రలు, బీరుసీసాలతో పాసవికంగా దాడి చేసి గాయపర్చారన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారన్నారు. వారి గుడ్డలు ఊడదీసి వివస్త్రను చేయడానికి ప్రయత్నించారన్నారు. మహిళలు కన్నీటి పర్యవంతం అయి వేడుకున్నా కనికరం చూపకుండా దాడి చేశారన్నారు. నాలుగు నెలల పసికందుపై కూడా దాడి చేశారన్నారు. ఈ దాడిలో నలుగురికి కాళ్లు విరిగి ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారన్నారు. మరో ఐదుగురు కూడా గాయపడ్డారన్నారు. ఈ ఘటనపై పోలీసులు లోతైన దర్యాప్తు చేవట్టాలన్నారు. దాడికి పాల్పడిన చెవిరెడ్డి, హనుమంత రెడ్డి, హరినాథ్ రెడ్డి, మద్దిరెడ్డి, చెన్నకేశవరెడ్డి, శంకర్ రెడ్డితో పాటు కర్నాటక రాష్ట్రం నుంచి వచ్చిన యువకులను అందరినీ వెంటనే అరెస్టు చేయాలన్నారు. వివాదాస్పద రెండు సెంట్ల స్థలాన్ని వడ్డెర కుటుంబానికి అందజేయాలని డిమాండ్ చేశారు.

పోలీసుల పహారాలో వెంకటరమణపల్లి

గోరంట్ల మండల పరిధిలోని వెంకటరమణపల్లిలో శుక్రవారం జరిగిన ఇరు వర్గాల దాడుల ఘటనతో గ్రామం మొత్తం ఒక్కసారిగా ఉలిక్కిపాటుకు గురైంది. ఈ ఘటనలో దాడులకు పాల్పడిన 14 మంది నిందితులపై కేసులు నమోదు చేయగా వారిలో తొమ్మిది మందిని శనివారం రిమాండ్‌కు తరలించారు. మిగిలిన వారికి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో 144 సెక్షన్ విధించారు. గ్రామంలోకి కొత్త వ్యక్తులు రాకూడదని సిఐ సుబ్బరాయుడు ఆదేశాలు జారీ చేశారు. దాంతో గ్రామంలోకి పోలీసులు కొత్తవారిని ఎవరినీ అనుమతించ లేదు. గ్రామంలో ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి పహారకాస్తున్నారు. గ్రామంలో జరిగిన సంఘటనను వీక్షించిన ప్రజలు ఏ సంఘటన జరుగుతుందోనని భయభ్రాంతులకు గురవుతున్నారు.

దాడికి పాల్పడిన నిందితులు అరెస్టు : ఎస్పీ

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలో వెంకటరమణ పల్లి లో శుక్రవారం నాడు వడ్డెర కుటుంబ సభ్యులపై దాడికి సంబంధించి నిందితులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. నిందితులతో పాటు రెండు కార్లు, ఒక బీరు బాటిల్, రెండు క్రికెట్ వికెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం నాడు శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డి విలేకరులకు వెల్లడించారు. వెంకటరమణపల్లి రెండు సెంట్ల స్థలం విషయంలో శుక్రవారం నాడు పెద్ద ఘర్షణ జరిగింది. ఇందులో వడ్డెర కులస్తులపై అదే గ్రామానికి చెందిన చౌడిరెడ్డి బంధువులు, మద్దతుదారులు దాడికి తెగబడ్డారు. ఈ దాడికి సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులను శనివారం అరెస్టు చేశారు. ఘటనకు సంబంధించి ప్రత్యక్షంగా పాల్గొన్న చౌడిరెడ్డి, చెట్టిచిన్నయ్యపల్లి గ్రామానికి చెందిన భయపరెడ్డి కుమారుడు చెన్నకేశవరెడ్డి, ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం నాంచారెడ్డిపాలెం గ్రామానికి చెందిన లేట్ శ్రీనివాస్ రెడ్డి కుమారుడు పిడుగు రామకష్ణారెడ్డి, కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నారాయణపురానికి చెందిన మునియప్పన్ కుమారుడు జాన్, తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా గుడియాతం తాలూకా చిన్నతంబుచెరువు వొళ్ళువోము గ్రామానికి చెందిన అరుమురుగన్ కుమారుడు విఘ్నేష్, కర్నాటక శ్రీనివాసపురం తాలూకా బత్తలపల్లి గ్రామానికి చెందిన మానియాచారి కుమారుడు దామోదర్, ఒంగోలు జిల్లా అల్లూరుసీతారామరాజు వీధికి చెందిన రామారావు కుమారుడు కోళ్ల మనోహర్, ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నాంచారెడ్డి పాల్యానికి చెందిన లేట్ సుబ్బారెడ్డి కుమారుడు చింతం రెడ్డి రాజశేఖర్ రెడ్డి, నెల్లూరు జిల్లా ఆనంద్ కుమారుడు చార్లెస్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరితో పాటు ఇందులో పాల్గొన్న చిట్టి చిన్నయ్యగారిపల్లి నారాయణరెడ్డి కుమారుడు హనుమంత్ రెడ్డి, మద్దిరెడ్డి, హరినాథ్ రెడ్డి, రామిరెడ్డి కుమారుడు శంకర్ రెడ్డి, వెంకటరమణపల్లి చౌడిరెడ్డి కుమారుడు అనిల్‌రెడ్డి పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ డీఎస్పీ హుస్సేన్ పీరా, గోరంట్ల సిఐ సుబ్బరాయుడు పాల్గొన్నారు.



ఇళ్ల కూల్చివేతను అడ్డుకుంటున్న సిపిఎం నాయకులు

పరిహారం ఇవ్వకుండానే కూల్చివేతలా..?

◆ తాడిమర్రిలో రోడ్డు విస్తరణను అడ్డుకున్న సిపిఎం ◆ నాయకుల అరెస్టు

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఎలాంటి పరిహారం ఇవ్వకుండానే ఏళ్ల తరబడి నివసిస్తున్న వారి గృహాలను ఎలా కూల్చివేస్తారంటూ సిపిఎం నాయకులు ప్రశ్నించారు. తాడిమర్రిలో రోడ్డు వెడల్పు పేరుతో ఇళ్లను కూల్చివేస్తుండగా సిపిఎం నాయకులు శనివారం నాడు అడ్డుకున్నారు. జెసిబిలకు అడ్డుపడి నిరసన తెలిపారు. అక్కడే ఉన్న పోలీసులు సిపిఎం నాయకులను బలవంతంగా పక్కకు లాగిపడేశారు. అయినా నాయకులు ఆందోళన విరమించకపోవడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ తాడిమర్రిలో రోడ్డు విస్తరణలో భాగంగా ఆర్అండ్‌బి అధికారులు గృహ యజమానులకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండానే తొలగించేస్తుండడం అన్యాయం అన్నారు. ప్రభుత్వం నుంచి బాధితులకు నష్టపరిహారం అందించాలన్నారు. గ్రామసభలు నిర్వహించకుండా ఇళ్లు కూల్చివేయడం నిబంధనలకు విరుద్ధమే అవుతుందని చెప్పారు. గ్రామ సభలు నిర్వహించి, ఒక వేళ కూల్చివేత తప్పనిసరి అయితే బాధితులకు ఆ ఆస్తి విలువను బట్టి పరిహారం ఇవ్వాల్సి ఉందన్నారు. అలాకాకుండా ఏకపక్షంగా ఇళ్లను తొలగించడం అన్యాయం అన్నారు. రోడ్డు వెడల్పులో ఇళ్లను కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వడంతో పాటు ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి, పక్కాగా ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకు సిపిఎం ఆధ్వర్యంలో వారిపక్షాన పోరాటం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెనుగొండ పెద్దన్న, కౌలు రైతుసంఘం నాయకులు కదిరప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నామాల నాగార్జున, తాడిమర్రి సిపిఎం నాయకులు నారాయణ, రైతు సంఘం నాయకులు పోతలయ్య బాధితులు పాల్గొన్నారు.



రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్నను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఎంపీ మిథున్ రెడ్డిని కలిసిన వాల్మీకి సుభాష్‌గాంధీ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గంలో అత్యధిక శాతం వాల్మీకులు ఉన్నారని, దీన్ని దష్టిలో పెట్టుకుని రాబోవు ఎన్నికల్లో హిందూపురం ఎంపీ టికెట్ తనకు కేటాయించాలని హిందూపురం వైసిపి నాయకుడు వాల్మీకి సుభాష్ గాంధీ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి విన్నవించారు. ఈ విషయంపై శనివారం న్యూ ఢిల్లీలో రాజంపేట ఎంపీ పెద్ద రెడ్డి మిథున్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తన రాజకీయ భవిష్యత్తుపై పలు విషయాలు వివరించారు.

ప్రజలకు మెరుగైన సేవలను అందించండి

ఛైర్‌పర్సన్ ఇంద్రజ



అధికారులతో కలిసి వార్డుల్లో పర్యటిస్తున్న ఛైర్‌పర్సన్ ఇంద్రజ

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపల్ అధికారులు పుర ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. శుక్రవారం రాత్రి 7వ వార్డు వార్డు ముక్కడిపేటలో చెట్టు కూలిపోయి, విద్యుత్ తీగలపై పడింది. దీంతో రాత్రి నుంచి ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలచిపోయింది. ఈ విషయవ తెలిసిన వెంటనే శనివారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌తో కలిసి ఆమె వార్డులో పర్యటించారు. మున్సిపల్ కార్మికులతో చెట్టును తొలగించి, విధ్యుత్ అధికారులతో చర్చించి వెంటనే విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నాసీరా బాను, ఎంఈ వెంకటరమణ, ఎఈ నాగేంద్ర, శానిటరీ ఇన్స్‌పెక్టర్ శంకర్ తదితరులు పాల్గోన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమానాలు పాటించాలి

రైల్వే రోడ్డులో 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.26లక్షలతో చేపడుతున్న మురుగు కాలవ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని గుత్తేదారులకు సూచించారు. శనివారం పనులనుయ ఆమె పరిశీలన చేశారు. అదే విధంగా విధ్యుత్ అధికారులతో మాట్లాడి రోడ్డుకు ఇరువైపుల ఉన్నా విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలని సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈ వెంకటరమణ, ఎఈలు నాగేంద్ర, జనార్ధన్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల అమలు బాధ్యత వైద్యాధికారులదే

ప్రజాశక్తి-హిందూపురం



వైద్యాధికారులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి

వైద్య ఆరోగ్యాశాఖ కార్యక్రమాల అమలు చేసే భాధ్యత వైద్యాధి కారులదేనని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని లక్ష్మీపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో పట్టణ, రూరల్ మండల వ్యాప్తంగా ఉన్న వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. దీని కన్న ముందు పలు రికార్డులను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అమలవుతున్న కంప్యూటర్ ఆప్లికేషన్లతో అమలవుతున్న అన్ని కార్యక్రమాలనూ సిబ్బందితో సక్రమంగా అమలు చేయించాలన్నారు. వాటి రిపోర్టుల నిర్వహణతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువయ్యేలా కషి చేయాలన్నారు. మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమం ద్వారా డ్రాప్ అవుట్ పిల్లలకు టీకాలు నిర్వహించాలన్నారు. హిందూపురం పట్టణంలో సంచరజాతులవారు, ఇతర రాష్ట్రాల కార్మికులు ఎక్కువ ఉన్నందున టీకాల కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డా॥శ్రీదేవితో పాటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి ప్రయివేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ సమస్యలు

ప్రజాశక్తి-హిందూపురం



సమస్యలపై వినతిని ఇస్తున్న నాయకులు

రాష్ట్రంలో ఉన్న ప్రయివేటు, ఎలక్ట్రికల్ వర్కర్స్ సమస్యలన్నీ ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి, వాటిని పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని ఏపీ ప్రయివేటు ఎలక్ట్రికల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాల్ రాజ్, ప్రధాన కార్యదర్శి హరిరావు, కార్యదర్శి మాదన్నలు పేర్కొన్నారు. శనివారం నాడు ప్రయివేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, వినతిని ఇచ్చారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులతో పాటు ప్రయివేటు ఎలక్ట్రికల్ కార్మికులకు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రకాలా సదుపాయాలు కల్పించే విధంగా కషి చేస్తామన్నారు. ప్రయివేటు ఎలక్ట్రికల్ కార్మికుల వత్తికి సంబంధించిన పరికరాలు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం రూ.2లక్షలు సబ్సిడీతో రుణ సదుపాయం కల్పించాలన్నారు. పనులు చేస్తూ ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 10 లక్షలు నష్టపరిహారం అందించాలన్నారు. ప్రతి మండలానికి ఎలక్ట్రికల్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేస్తూ కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు. ప్రయివేటు ఎలక్ట్రికల్ కార్మికుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఎలక్ట్రికల్ డే నిర్వహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రయివేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.లక్ష్మీనారాయణ, కార్యదర్శి సుధాకర్, వైస్ ప్రెసిడెంట్ నసురుల్లా, కార్యదర్శి ఏజాజ్, మాజీ ప్రెసిడెంట్ జిలాన్ పాల్గొన్నారు.

నిమజ్జనానికి కోనేరు వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తాం

కోనేరు పరిశీలనలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ

ప్రజాశక్తి-హిందూపురం



గుడ్డం కోనేరును పరిశీలించి అధికారులకు సూచనలు ఇస్తున్న ఛైర్‌పర్సన్ ఇంద్రజ

గణేష్ నిమజ్జనం చేసే గుడ్డం కోనేరు వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ సూచించారు. శనివారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌తో కలిసి గుడ్డం కోనేరును పరిశీలించారు. ఈ సందర్భంగా కోనేరు వద్ద నిమజ్జానానికి తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు నిమజ్జనం తిలకించడానికి వచ్చే భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. కోనేరు చుట్టు మొత్తం శుభ్రం చేయించాలని వారికి సూచించారు. అనంతరం ఇంద్రజ మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ఎక్కడ లేని విధంగా హిందూపురం పట్టణంలో గణేష్ పండుగ జరుగుతుందన్నారు. నిమజ్జనం రోజు పట్టణంలో ఎక్కడా ఏలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాటు మున్సిపల్ శాఖ తరపున చేపడుతామన్నారు. పట్టణంలోని వినాయక విగ్రహాలన్నీ నిమజ్జనం చేయడానికి కోనేరుకు వెళ్లే దారితో పాటు కోనేరు వద్ద అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జ్ మల్లిక బాను, ఎంఈ వెంకటరమణ, ఎఈలు నాటేంద్ర, జనర్ధాన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు కృషి

ప్రజాశక్తి-హిందూపురం

అంధత్వ నివారణకు ట్రినిటీ ఆర్గనైజేషన్, బెంగళూరుకు చెందిన శంకర్ నేంత్రాలయం చేస్తున్న కృషి అభినందనీయం అని సిఅండ్ఐజి మిషన్ చర్చి అధ్యక్ష, కార్యదర్శులు అనిల్‌కుమార్, పాల్‌లు తెలిపారు. శనివారం పట్టణంలోని అల్‌హిలాల్ పాఠశాల ఆవరణంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెలా రెండవ శనివారం ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి వారు సౌజన్యంతో కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఉచిత పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు, శస్త్ర చికిత్సలు చేస్తున్నారని చెప్పారు. అనంతరం 650 మందికి కంటి పరీక్షలు నిర్వహింగా ఇందులో 230 మందికి శస్త్ర చికిత్సకోసం బెంగళూరుకు తరలిచారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ ఆర్గనైజేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కుమార్‌రాజా, ఉషారాణి, కంటి వైద్య నిపుణులు డా॥అనూహ్య, వాలంటీర్లు రహంతుల్లా పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

ఫ్యాప్టో డిమాండ్



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ కోడూరు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం వద్ద 12 గంటల నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిన సిఎం జగన్ నేటికీ రద్దు చేయకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం జిపిఎస్ పేరుతో మరోసారి మోసం చేయడా నికి ప్రయత్నిస్తోందని, ఈ విధానాన్ని అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. ఫ్యాప్టో జనరల్ సెక్రటరీ రామకృష్ణ మాట్లాడుతూ పాఠశాల విద్యారంగానికి తీవ్ర విఘాతం కలిగించే జీవో-117ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల రాష్ట్రంలో 9 వేల పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్ కుమార్, బికె ముత్యాలప్ప ఫ్యాప్టో నాయకులు జయచంద్రారెడ్డి, సుధాకర్, రామ్మోహన్, హరిప్రసాద్‌రెడ్డి, త్రిమూర్తి, ఎన్జీవో ప్రెసిడెంట్ రామ్మోహన్, సురేంద్ర మాట్లాడుతూ డీఎస్సీ-2008, 1998 ఎంటిఎస్ ఉపాధ్యాయులను తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కెజిబివిల సిబ్బందికి ఎంటిఎస్‌ను అమలు చేస్తూ వారిని రెగ్యులర్‌గా నియమించాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లోని చిన్న చిన్న కారణాలతో అధికారులు, ఉపాధ్యాయులను విజయవాడ కార్యాలయానికి రప్పించుకోవడాన్ని, ఉపాధ్యాయులను వేధించడాన్ని ఖండించారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను పూర్తిగా తప్పించి కేవలం బోధనకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ ఏర్పాటు చేసి వెంటనే బదిలీలు చేపట్టాలని మున్సిపల్ విద్యాశాఖ అధికారి పోస్టుని కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సెక్రటరీ జనరల్ రామ కృష్ణ, కో ఛైర్మన్ సుధాకర్, రామ్మోహన్ త్రిమూర్తి, జయచంద్రారెడ్డి, బాబు, చింతా నాగరాజు, చంద్ర, రాజశేఖర్, భూతన్న, రవీంద్రరెడ్డి, సిపిఐ నాయకులు వేమయ్య, ఎన్జీవో సంఘం అధ్యక్షులు లింగా రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా లేపాక్షి కవితా వైభవం



కవులను సన్మానిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-చిలమత్తూరు

శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో శనివారం స్థానిక విరాట్ ప్యాలెస్‌లో నిర్వహించిన లేపాక్షి కళావైభవం అట్టహాసంగా సాగింది. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక వ్యవస్థాపకులు కత్తి మండల ప్రతాప్ మాట్లాడుతూ కవిత్వం ప్రజాసామ్య విలువలు కాపాడేదిగా ఉండాలన్నారు. ఏసీ గదుల్లో కూర్చొని కష్టజీవులు, సామాన్య ప్రజల గురించి కవిత్వాలు రాస్తే అది వాస్తవికతకు దూరంగా ఉంటాయన్నారు. సాహితీ ప్రవంతి జిల్లా కన్వీనర్ హరిగంగాధర్ మాట్లాడుతూ శ్రీశ్రీ సమాజంలో జరిగే దురాఘతాలను ఎప్పటికప్పుడు ఎండగట్టడంతో పాటు సమాజంలో చైతన్యం కలిగించారన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్నా మహిళలకు రక్షణ లేదని, మణిపూర్ ఘటన యావత్తు దేశం తలదించుకునేలా ఉందన్నారు. మహిళలపైనే కాకుండా భాషపై కూడా కేంద్ర ప్రభుత్వ తీరు శోచనీయం అన్నారు. తెలుగు కవులు దీనిని తిప్పికొట్టాలన్నారు. హిందీ భాషను రుద్దుతూ ప్రాంతీయ భాషపై జరుగుతున్న దాడిని వ్యతిరేకించడం కవుల కర్తవ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో యువజన జాతీయ ప్రధాన కార్యదర్శిగా వడ్డి సుధాకర్‌ను ప్రకటించారు. అనేక కవితా సమ్మేళనాలను నడుపుతూ అనేక కవులను వెలుగులోకి తీసుకురావడమే శ్రీశ్రీ కళావేదిక లక్ష్యం అని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కొళ్ల రమావతి, చిట్టే లలిత, ఎంపిపి పురుషోత్తమరెడ్డి, ఎంఇఒ సాల్మన్‌రాజ్, అలీముల్లా, రవీంద్రరెడ్డి, ఇరు తెలుగు రాష్ట్రాల కవులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో కంటిచూపు సమస్యలను పరిష్కరిస్తాం



కరపత్రాలు, కంటిచూపు పట్టికను విడుదల చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

విద్యార్థుల్లో కంటిచూపు సమస్యలను పరిష్కరించడమే ధ్యేయమని విశ్రాంత కంటి వైద్య నిపుణులు, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ నరసింహులు పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్‌బిఐ కాలనీలో ఉన్న మధు కంటి వైద్యశాలలో ఈ సందర్భంగా శనివారం ఉపాధ్యాయులకు కంటి సమస్యలు, దృష్టి లోపాలపై పలు విషయాలను తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా చేనేత వ్యాపారులు జయశ్రీ, సెయింట్ మేరీ స్కూల్ హెచ్‌ఎం జాన్ రెడ్డి, ప్రయివేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షులు ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం, కంటిచూపు పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. టీవీ, సెల్‌ఫోన్ ఎక్కువగా చూడటం వల్ల కంటి చూపు తక్కువ అవుతుందని తెలిపారు. దృష్టి లోపాలు, కంటి సమస్యలను గుర్తించేందుకే ప్రతి పాఠశాలకు కంటి చూపు పట్టికను పంపిణీ చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం కరపత్రాలు, కంటిచూపు పట్టికను విడుదల చేశారు. సమావేశానికి హాజరైన పాఠశాలల హెచ్‌ఎంలకు కంటిచూపు పట్టికను అందజేశారు. కార్యక్రమంలో చేనేత వ్యాపారులు పార్థసారథి, మహర్షి, లెయోలా స్కూల్స్ హెచ్‌ఎంలు కొండారెడ్డి, శంకర్‌నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధే సిఎం జగన్ ధ్యేయం



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

అభివృద్ధే సిఎం జగన్ ధ్యేయమని ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పట్నంలో రూ. 40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, బల్క్ మిల్క్ సెంటర్ నూతన భవనాలను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్‌బికెల ద్వారా రైతుల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయడం, విత్తన కాయలను సబ్సిడీ ధరపై పంపిణీ చేయడం, ఎరువులు, మందులను అందుబాటులో ఉంచడం, రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేయడం, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. పాడి రైతులు ప్రయివేట్ ఏజెన్సీల ద్వారా దగాకు గురవుతున్నారని, వాటిని అధిగమించేందుకు ప్రభుత్వమే బల్క్ మిల్క్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ సెంటర్ల ద్వారా పాలను శీతలీకరణ చేసి, వాటిని మార్కెటింగ్ చేస్తామన్నారు. ఇటువంటి పాలన గతంలో ఎన్నడూ లేదని రైతన్న రాజ్యం కోసం జగన్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. నాణ్యతలో రాజీ పడకుండా మంచి భవనాన్ని నిర్మించి ఇచ్చిన కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ అగ్రి బోర్డు ఛైర్మన్ రమణారెడ్డి, ఎంపిపిలు, జడ్పిటిసిలు, మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు, వైస్ ఎంపిపి, కో ఆప్షన్ సభ్యులు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, సర్పంచులు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్లు, వివిధ శాఖల ఛైర్మన్లు, డైరెక్టర్లు, పోలింగ్ బూత్ మేనేజర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కన్వీనర్లు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ అసమర్థ పాలనతోనే విద్యుత్ కోతలు



మహిళలకు మేనిఫెస్టోను వివరిస్తున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

సాధారణంగా వేసవిలో విద్యుత్ కోతలు ఉంటాయని, కానీ వర్షాకాలంలో విద్యుత్ కోతలు విధించడం జగన్ అసమర్థత పాలనకు నిదర్శనమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. భవిష్యతుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 35, 36 వార్డుల్లో ఆయన ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యుత్ కోతలు విధిస్తుండడంతో పనులు ముందుకు సాగడం లేదని ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉండేదని, ఛార్జీల పేరుతో ప్రజలపై మోయలేని భారాలు కూడా మోపలేదన్నారు. కానీ జగన్ పాలనలో విద్యుత్ కోతలు తరచూ విధిస్తుండటంతో పాటు విద్యుత్ ఛార్జీలను నెలకోసారి బారీగా పెంచుతున్నారని విమర్శించారు. ఇలాంటి సమస్యలపై ఎమ్మెల్యే కేతిరెడ్డి స్పందించరు కానీ గుడ్ మార్నింగ్ పేరుతో షో చేస్తుంటారని విమర్శించా రు. ప్రజలకు ఇలాంటి కష్టాలన్నీ పోవాలంటే టిడిపి అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో 35వ వార్డు నాయకులు తోట నారాయణస్వామి, బుధవారపు శ్రీనివాసులు, వనం లక్ష్మీనారాయణ, 36వ వార్డు నాయకులు మహేశ్వరి, సుబ్బయయ్య, రాయపాటి శివ పాల్గొన్నారు.



గొంతుకు ఉరి తాళ్లు తగిలించుకుని నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, నిరుపేదలు

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి


ఐద్వా జిల్లా గౌరవాధ్యక్షురాలు దిల్షాద్.. మెడకు ఉరి తాళ్లు వేసుకుని వినూత్న నిరసన

ప్రజాశక్తి -పెనుకొండ

నవరత్నాల్లో భాగంగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఐద్వా మహిళా సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు దిల్షాద్ డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారం కూడా కొనసాగాయి. ఇందులో భాగంగా మహిళలు వినూత్నంగా మెడకు ఉరి తాళ్లు బిగించుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దిల్షాద్ మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో చాలా మంది నిరుపేద ప్రజలు సొంత ఇళ్లు లేక బాడుగలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ క్రమంలో ఇళ్ల స్థలాల కోసం తహశీల్దార్, కమిషనర్, సబ్ కలెక్టర్, కలెక్టర్, సచివాలయంలో అర్జీలు ఇచ్చారన్నారు. కావున ఇల్లు లేని నిరుపేదలకు నిబంధనల ప్రకారం న్యాయం చేయాలని కోరారు. ఇళ్ల పట్టాలు ఇచ్చేంతవరకు పేదలకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు, నారాయణ, సిపిఎం నాయకులు తిప్పన, బాలు, రమేష్, నిరుపేదలు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘానికి ఫిర్యాదుచేస్తాం

పరిటాల సునీత



ఆర్డీఓతో మాట్లాడుతున్న పరిటాలసునీత, నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి ఒత్తిడితోనే చెన్నేకొతపల్లి మండలంలో జరుగుతున్న పంచాయతీ వార్డు ఉప ఎన్నికల నామినేషన్లను ఆర్ఓ తిరస్కరించారని మాజీ మంత్రి పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. చెన్నేకొత్తపల్లి మండలం గంగినేపల్లితండా, న్యామద్దెల పంచాయతీల్లో వార్డు స్థానాలకు టిడిపి మద్దతుదారుల నామినేషన్లను ఆర్ఓ తిరస్కరించ డంపై శనివారం పరిటాల సునీత టిడిపి నాయకులతో కలిసి ధర్మవరం ఆర్డీఓ కార్యాలయం చేరుకుని నామినేషన్లకు సమర్పించిన పత్రాలను చూపించి ఆ విషయంపై చర్చించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఏకగ్రీవం చేసుకోవాలన్న ఉద్దేశంతోనే వైసిపి నాయకులు ఇలా చేయించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి ఒత్తిడితో ఆర్డీఓ తిప్పేనాయక్ ఆదేశాల మేరకు ఆర్ఓ అశోక్‌నాయక్ నామినేషన్లను తిరస్కరించారని ఆరోపించారు. ఆర్డీఓ ఎవరో చెప్పిన మాటలు విని అక్రమాలకు పాల్పడితూ ఎక్కడున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఇకనైనా ఈ విషయంలో పునరాలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని లేకపోతే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ఆమె హెచ్చరించారు.

ఎన్నికలకు సన్నద్ధం కండి : పల్లె



సమావేశంలో మాట్లాడుతున్న పల్లె రఘునాథ్ రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రాబోయే ఎన్నికలకు టిడిపి శ్రేణులు సన్నద్ధం కావాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని 6 మండలాల కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నియోజకవర్గ పరిశీలకులు మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు ఎంతో కీలకమని, టిడిపి శ్రేణులు ఇప్పటి నుంచే సైనికుల్లా పని చేయాల్సి ఉంటుందన్నారు. అధికార పార్టీ నాయకులు దొంగ ఓట్లతో గెలవాలని ప్రయత్నిస్తున్నారని కావున టిడిపి నాయకులు, కార్యకర్త లు ఓటరు వెరిఫికేషన్‌లో పాల్గొని దొంగ ఓట్ల నమోదుపై జాగ్రత్త వహించాలన్నారు. బచ్చుల పుల్లయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి ఓటు ఎంతో విలువైందని టిడిపి శ్రేణులు నిబద్ధతతో పని చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. బూత్ లెవెల్ కన్వీనర్లు ఓటర్ వెరిఫికేషన్‌లో కీలకంగా వ్యవహరించాలన్నారు. గ్రామస్థాయిలో అధికార పార్టీ అవినీతి, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండలంలో ఇటీవల రోడ్డు ప్రమా దాలు, అనారోగ్యానికి గురైన వైసిపి నాయకుల కుటుంబాలను శనివారం ఎమ్మెల్యే డి.శ్రీధర్‌రెడ్డి పరామర్శించారు. ఇందులో భాగంగా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొత్తచెరువుకు చెందిన జక్కంపూడి చలపతి ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించారు. కురుబ సూరి, కుమార్తె రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా ఆయన భార్య మృతి చెందింది. దీంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ద్విచక్ర వాహన ప్రమాదం లో గాయపడి చికిత్స పొందుతున్న వడ్డే నాగేష్ ఇంటికి వెళ్లి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. గుండెపోటుకు గురైన డ్రైవర్ మూర్తిని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఎస్సీ కాలనీలో సాయి భార్య యమునను పరామర్శించారు. మరుకుంటపల్లి గ్రామంలో అనారోగ్యానికి గురైన ప్రమీలమ్మ, చెన్నమ్మలను, తలమర్లలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మాధవరెడ్డిని పరామర్శించారు. అనంతరం ఎంపిపి గాయత్రి రెడ్డప్పరెడ్డి ఇంటికి వెళ్లారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, వాల్మీకి శంకర్, నాగభూషణ్, మటన్ శంకర్, కెవి షాజహాన్, మేజర్ పంచాయ తీ సర్పంచి రాధానాగరాజు, పుట్టపర్తి ఎంపిపి రమణారెడ్డి, సుబ్బారావు , భాస్కర్, సోమశేఖర్‌రెడ్డి, గంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బైక్‌ను ఢీకొన్న బొలెరో.. ఇద్దరు మృతి

ఒకరి పరిస్థితి విషమం



ప్రమాదానికి గురైన యువకులు

ప్రజాశక్తి-రొద్దం

ద్విచక్ర వాహనాన్ని బొలెరో ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘట న శనివారం కర్నాటకలోని పావగడ సమీపంలో కడమలకుంట బస్ స్టాప్ వద్ద చోటుచేసుకంది. వివరాలు.. రొద్దం మండల పరిధిలోని చిన్నకోడిపల్లి గ్రామానికి చెందిన జస్వంత్(16), ఈశ్వర్(17), రాము ముగ్గురూ కలిసి ఉదయం స్వగ్రామం నుంచి పావగడలో వెలసిన శనిమహాత్ముని దేవస్థానానికి బయల్దేరారు. వారు కర్నాటకలోని కడమలకుంట గ్రామ బస్‌స్టాప్ వద్ద వెళ్తుండగా పావగడ వైపు నుంచి ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొనడంతో జస్వంత్ అక్కడికక్కడే మృతి చెందగా ఈశ్వర్ తీవ్రగాయాలతో పావగడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన రామును బత్తలపల్లి ఆర్డిటి ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనం కర్నాటకలోని పావగడ తాలూకా నాగలమడక వద్ద పట్టుబడినట్లు తెలిసింది. జస్వంత్ రొద్దంలోని టీచ్ హైస్కూల్‌లో పదో తరగతి, ఈశ్వర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఈ ప్రమాదంతో చిన్నకోడిపల్లి గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. జస్వంత్ తండ్రి రొద్దం విద్యుత్ శాఖలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు కాగా జస్వంత్ చిన్న కుమారుడు. ప్రమాద విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బికె పార్థసారథి, ఆయన సతీమణి కమలమ్మ, జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, పెనుగొండ నియోజకవర్గ అధ్యక్షులు చిన్నప్పయ్య, చంద్రమౌళి, అశ్వత్థనారాయణ, హరీష్ పావగడ వెళ్లి వారి కుటుంబాలను ఓదార్చారు.

యువకుడి ఆత్మహత్య



రామిరెడ్డి(ఫైల్)

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రియాంకనగర్‌కు చెందిన రమణారెడ్డి, కేశమ్మ దంపతుల కుమారుడు రామిరెడ్డి(30) శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. రామిరెడ్డి ద్విచక్ర వాహనం మెకానిక్ పనులు చేసుకుంటూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండేవాడు. తల్లిదండ్రులు కూడా కూలి పనులకు వెళ్లి కుటుం బాన్ని పోషించుకునేవారు. అయితే ఇటీవల రామిరెడ్డి పనులకు సరిగా వెళ్లకుండా జులాయిగా తిరుగుతుండడంతో తల్లి మందలించేది. ఈ క్రమంలో తెల్లవారుజా మున రామిరెడ్డి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కిందకు దించినా అప్పటికే అతడు మృతి చెందాడు. రామిరెడ్డి ప్రయివేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేసి వాటిని తీర్చేందుకు సొంతింటిని అమ్మేసి అప్పులు తీర్చి అద్దె ఇంటో ఉంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని సమాచారం.

బావిలో గుర్తుతెలియని మృతదేహం

తలుపుల : మండల పరిధిలోని వేపమానుపేట పంచాయతీ పెద్దపల్లి సమీపంలోని ఓ బావిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తేలింది. గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ మక్బుల్‌బాషా, పోలీసులు, వీఆర్వో ప్రకాష్ సంఘటనా స్థానానికి చేరుకుని మృతదేహన్ని బావిలో నుంచి వెలికి తీశారు. అలాగే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాముకాటుతో వృద్ధుడు మృతి

చిలమత్తూరు : మండల పరిధిలోని తుమ్మలకుంట గ్రామానికి చెందిన చిన్నగంగప్ప(70)ను మూడు రోజుల క్రితం ఇంటి దగ్గర పాము కాటు వేయగా కుటుంబ సభ్యులు బాగేపల్లి ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చిక్కబాలాపూర్‌కు అక్కడి నుంచి బెంగుళూరుకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి 2 గంటల సమయంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గుండెపోటుతో ల్యాబ్ అసిస్టెంట్ మృతి

మడకశిర : పట్టణంలోని మారుతి నగర్‌లో నివాసం ఉంటున్న ల్యాబ్ అసిస్టెంట్ వెంకటరమణస్వామి(56) శనివారం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకటరమణ స్వామి ల్యాబ్ అసిస్టెంట్‌గా హిందూపురం బాలికల జూనియర్ కళాశాలలో పనిచేస్తూ ఉండేవాడు. రెండేళ్ల క్రితం భార్య కరోనాతో మృతిచెందగా ప్రస్తుతం వెంకటరమణ స్వామి మృతి చెందడంతో కుమారుడు, కూతురు అనాథలయ్యారు. కళాశాల బృందం, మిత్రులు అధిక సంఖ్యలో వచ్చి సంతాపం వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రొద్దం : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పోలీసులు సీజ్ చేశారు. మండలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సచివాలయాలు, ఆర్‌బికెల నిర్మాణాలకు అనుమతులు తీసుకొని వాటితో పాటు వివిధ గ్రామాల్లో ప్రజలకు అధిక ధరకు ఇసుక తరలిస్తున్న శేఖర్ అనే వ్యక్తి ట్రాక్టర్‌ను శనివారం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

టిడిపితోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

ఓబుళదేవరచెరువు : టిడిపితోనే భవిష్యత్తుకు గ్యారెంటీ అని జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండకమర్ల గ్రామంలో శనివారం టిడిపి ఆధ్వర్యంలో మహాశక్తి చైతన్య రథయాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మినీ మేనిఫెస్టో, భవిష్యత్తుకు గ్యారెంటీ, మహాశక్తి పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాకీర్ అహమ్మద్, సాధిక్‌వలి, గండికోట ఇర్షాద్, షన్వాజ్, తెలుగు మహిళా అధ్యక్షురాలు లావణ్యగౌడ్, మాధవి, మండల మహిళా అధ్యక్షురాలు రాధమ్మ, ఎనుములపల్లి కౌన్సిలర్ చెన్నకృష్ణమ్మ, మస్తానమ్మ, శేషయ్యగారిపల్లి తండా సర్పంచి రేణుకాబాయి, పి.షఫీఅహ్మద్‌వలి, శంకర, బాలకృష్ణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగన్ వైఫల్యాలను వివరించండి

ప్రజాశక్తి-పెనుకొండ

వైసిపి ప్రభుత్వం, సిఎం జగన్, మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేల వైఫల్యాలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరిం చాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి సూచించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ పరిశీలకులు పిజి నరసింహులు యాదవ్, ఇన్‌ఛార్జి పార్థసారథి ఆధ్వర్యంలో క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బికె మాట్లాడుతూ ఓటరు వెరిఫికేషన్‌ను ఎప్పటికప్పు డు పరిశీలిస్తూ ఏదైనా సమస్య ఉంటే వెంటనే తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. నరసింహులు యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలు, టిడిపి చేపట్టిన మహాశక్తి పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు సిద్ధలింగప్ప, లక్ష్మిరెడ్డి, సిద్ధయ్య, నరహరి, పట్టణ అధ్యక్షులు రవిశంకర్, రాష్ట్ర మైనారిటీ అధికార ప్రతినిధి హుజూర్, పెనుకొండ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జులు రామకృష్ణ, ఆనంద్, బాలకృష్ణ, వి.సురేష్, చల్లాపల్లి రామకృష్ణ, హనుమంతనాయక్, జావిద్, మనోహర్, తిరుపాల్, యూనిట్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బికె పార్థసారథి




ఎండుతున్న పంటలను పరిశీలిస్తున్న గుండుమల

టిడిపి ఆధ్వర్యంలో పంటల పరిశీలన

మడకశిర : తీవ్ర వర్షాభావంతో ఎండుతున్న పంటలను శనివారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గుండుమల మాట్లాడుతూ ఇప్పటికీ చాలామంది రైతులు వేరుశనగ విత్తనం వేయలేదన్నారు. ఈ ప్రాంతంలో ప్రధాన పంట వేరుశనగ కావడంతో అదును దాటిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరోవైపు ఇప్పటికే సాగు చేసిన పంటలు వర్షాలు కురవకపోవడంతో ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో అప్పులు చేసి అడపాదడపా ప్రధాన పంటగా వేరుశనగ పంటను సాగు చేసినా వర్షాభావంతో ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఎండుతున్న పంటలను పరిశీలించిన గుండుమల నష్టపోతున్న రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ కుమార స్వామి, జడ్పిటిసి ఉమేష్, శివకుమార్, శ్రీనివాస్, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, తిమ్మరాజు, కౌన్సిలర్ ఉమాశంకర్, బసవరాజు, నరసింహప్ప, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆశల జూదం ఆడలేక



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిత్యం కరువుకు నిలయమైన అనంతపురం జిల్లాలో రైతులు ఏటా వర్షాన్ని నమ్ముకోవడం పంటలు సాగు చేయడం... నష్ట పోవడం పరిపాటిగానే మారుతూ వచ్చింది. కొన్ని దశాబ్ధాలుగా ఇదే తీరు. ఎన్ని ఇబ్బందులు, కష్టాలొచ్చినా భూమి మాత్రం బీడు పెట్టకుండా ఏటా పంట వస్తుందన్న నమ్మకంతో ఆశల జూదం ఆడుతూ వచ్చాడు. అయితే క్రమక్రమంగా చూస్తే జిల్లాలో రైతులకు వర్షాధారాన్ని నమ్ముకుని సాగు చేయడంపై ఆసక్తి తగ్గిపోతున్నట్టు కనిపిస్తోంది. అందులో ప్రధానపంట అయిన వేరుశనగ పూర్తిగా తగ్గిపోతూ వస్తోంది. ఈ దశబ్ధకాలంలో వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోతూ వస్తుండటమే అందుకు ఉదాహరణ. ఒకప్పుడు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 23 లక్షల ఎకరాల వరకు కూడా వేరుశనగ పంట సాగైన దాఖలాలున్నాయి. అయితే అది క్రమంగా తగ్గుతూ సాధారణ సాగే 11 లక్షల ఎకరాలకు పడిపోయింది. ఈ సంవత్సరం అది కూడా సాగయ్యే అవకాశాలు కనిపించడం లేదు. సాధారణ సాగు ఐదారు లక్షల ఎకరాలకు కూడా చేరలేదు. అంటే తక్కువ అనుకున్న దానిలోనూ సగమే వేరుశనగ విత్తనం పడింది. ఎందుకంటే ప్రకృతి వైపరిత్యాల ప్రభావం ఒకవైపు అయితే పెరుగుతున్న పెట్టుబడులు అందుకు తగ్గట్టు గిట్టుబాటు ధర లేకపోవడంతో వేరుశనగపై అనంతపురం జిల్లా రైతాంగానికి ఆసక్తి తగ్గిపోతున్నట్టు కనిపిస్తోంది. ఈ సంవత్సరమైతే రెండు జిల్లాలో కలిపి 40 శాతానికిపైగా భూమి ఇప్పటికీ బీడుగానే ఉంది. నీటి వసతి ఉంటే తప్ప పంటలు సాగుకు రైతులు సమయత్తమవడం లేదు పెట్టుబడి పెట్టి నష్టపోవడం అప్పుల ఊబిలో చిక్కుకుని ఆత్మహత్యలు చేసుకునే కంటే ప్రత్యామ్నాయంపై దృష్టి సారిస్తే బాగుంటుందన్న ఆలోచనతో జిల్లాలో క్రమక్రమంగా ఇతర వృత్తుల వైపు మల్లుతున్న వారూ ఉన్నారు. నీటి వసతి ఉన్న చోట కూడా రైతులు పంటల సాగుకు ఒకటికి,రెండు సార్లు ఆలోచిస్తున్నారు. ఈ రకంగా అత్యధికంగా పండే టమోట పంట కూడా తక్కువగానే సాగైంది. జిల్లాలో 40 వేల ఎకరాల్లో ఈ పంటలు సాగయ్యే చోట సగానికి సగం పడిపోయింది. దీంతో జూన్ నుంచి జిల్లాలో టమోటా దిగుబడులు రావాల్సిన చోట రాలేదు. దీంతో మొన్నటి వరకు టమోట పంటకు డిమాండ్ ఏర్పడటంతో కిలో రూ. వందపైగా ధర పలికింది. ఇది చూసి పంటలు సాగు చేసిన తరువాత కోతలకు వస్తున్న సమయంలో ధర తగ్గిపోయి కిలో రూ.20కు చేరవ అవుతోంది. ఇలా రైతులు ప్రకృతి వైపరీత్యాలు, అటు గిట్టుబాటు ధరల్లేక వ్యవసాయం నుంచే తప్పుకునేందుకు కూడా సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది చూస్తే జూన్ నుంచి జులై మాసం వరకూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఆగస్టులో ఒక మోస్తరు వర్షం పడినప్పటికీ ఇంకా సగం మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. రైతులను ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిమాండ్ చేశారు.. వర్షాభావ పరిస్థితులకు తోడు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా సాగునీరైనా తీసుకుందామంటే కాలువల గట్లు బలహీనంగా ఉన్నాయి. నీరు రావడం ప్రారంభమైందో లేదో అప్పుడే గండ్లు పడ్డాయి.తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితి దయనీయంగా ఉన్నా మరమ్మత్తులు చేపట్టే పరిస్థితి కూడా ప్రభుత్వానికి లేకుండాపోయింది. ఈ రకంగానూ రైతులకు తీరని నష్టమే జరుగుతోంది. ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై పూర్తి స్థాయిల నిర్లక్ష్యం చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఇది వరకే టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రాజెక్టుల పర్యటన చేపట్టిన విషయం తెలిసిందే.

జనార్ధన్‌రెడ్డికి శ్రీశ్రీ కళావేదిక అవార్డు

కొత్తచెరువు రూరల్ : మండల పరిధిలోని కేశపురం గ్రామానికి చెందిన తెలుగు కవి కత్తి జనార్ధన్‌రెడ్డికి శనివారం శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో అవార్డును ప్రదానం చేశారు. లేపాక్షిలో నిర్వహించిన కవితల పోటీల్లో 'తెలుగు అక్షరాల విశిష్టత' అంశంపై ఆయన ప్రతిభ కనబరిచినందున అవార్డు దక్కింది. ఈ సందర్భంగా జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జగరాజుపల్లి మంగళకర డిగ్రీ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పని చేస్తున్నానన్నా, యాజమాన్యం, విద్యార్థుల ప్రోత్సాహంతో కవితలు రాస్తున్నానన్నారు.